
క్లుప్తంగా

రెవెన్యూ సదస్సుల నిర్వహణపై డీపీవో సమీక్ష



హనుమాన్‌జంక్షన్ రూరల్: రెవెన్యూ సదస్సుల నిర్వహణపై అధికార యంత్రాంగం అలసత్వం వహించవద్దని జిల్లా పంచాయతీ అధికారి జె.అరుణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై గ్రామ సచివాలయ ఉద్యోగులతో గురువారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ నెలాఖరు వరకు సదస్సులు గ్రామగ్రామాన నిర్వహించనున్నామని చెప్పారు. ఈ సదస్సుల్లో రెవెన్యూ, సర్వే, వ్యవసాయ సంబంధిత అర్జీలను రైతుల నుంచి సేకరించి సత్వరంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అర్జీల స్వీకరణ, పరిష్కారంలో ఏమాత్రం జాప్యం చేయవద్దని సూచించారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ మృతి


మున్నంగి అర్జున్‌రెడ్డి

పెనమలూరు: వైఎస్సార్ సీపీ పోరంకి గ్రామ పార్టీ కన్వీనర్ మున్నంగి అర్జున్‌రెడ్డి (67) బుధవారం మృతి చెందారు. ఆయన గుండె సంబంధ ఇబ్బందితో పోరంకిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా స్టంట్స్ వేస్తున్న సమయంలో మృతి చెందారు. ఆయన స్వగ్రామం పామర్రు సమీపంలో కొండిపర్రు. ఆయన సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ నేతలు ఆయన మృతి పట్ల సంతాపం ప్రకటించారు.

నేలను కాలుష్యం బారి నుంచి పరిరక్షించుకోవాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ నేల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, రైతులతో మండల వ్యవసాయశాఖ అధికారి జొన్నలగడ్డ భవాని భూసార ఆరోగ్య ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సహజవనరు అయిన నేలను కాలుష్యం కోరల్లోకి నెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నేలను ఆరోగ్యంగా ఉంచటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులు, రైతులకు ఆమె వివరించారు. 9వ తరగతి విద్యార్థులకు మట్టి పరీక్షలు చేసే విధానంపై వ్యవసాయ అధికారులు శిక్షణ ఇచ్చారు. భూసార పరీక్షల వల్ల ప్రయోజనాలను వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీఈవో రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

చర్చి వేడుకలకు ఆర్థిక సాయం



పెనమలూరు: వణుకూరు గ్రామంలో ఆర్‌సీఎం చర్చి 25 సంవత్సరాల వేడుకలకు పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు కానూరులో గురువారం జరిగిన కార్యక్రమంలో చర్చి నిర్వాహకులకు వణుకూరు సర్పంచ్ భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు చక్కా గోపి నగదు చెక్కు అందచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

దేవస్థానం హుండీ ఆదాయం రూ.1.65 లక్షలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: నూజివీడురోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.1.65 లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాస్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో హుండీ ఆదాయం లెక్కింపు గురువారం జరిగింది. దేవదాయ శాఖ గన్నవరం డివిజన్ ఇన్‌స్పెక్టర్ కోటిపల్లి వెంకట అనురాధ పర్యవేక్షణలో భక్తులు, ఆలయ ట్రస్టీలు, అర్చకులు, ఉద్యోగులు హుండీ ఆదాయం లెక్కించారు. గత నాలుగు నెలలకు గానూ ఈ ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఆలయ ట్రస్టీ తవ్వా పూర్ణచంద్రరావు, మాజీ సర్పంచ్ కాకాని అరుణ పాల్గొన్నారు.

నేడు గంగూరు 132 కేవీ ఉపకేంద్రం మరమ్మతులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఏపీ ట్రాన్స్‌కోకు చెందిన గంగూరులోని 132 కేవీ ఉపకేంద్రం సాంకేతిక మరమ్మతులు శుక్రవారం చేపట్టనున్నట్లు ఓఅండ్‌ఎం గుణదల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.కిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఆ ఉపకేంద్రం విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలుపుదల చేస్తామన్నారు. సాధారణ ప్రజలకు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని తెలిపారు. కానీ అత్యవసర పరిస్థితి ఏర్పడితే విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

బస్సులు ఏటైంకు వస్తాయో..?

- సమయపాలన పాటించని ఆర్టీసీ బస్సు సర్వీసులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- స్పందించని ఆర్టీసీ అధికారులు


తెన్నేరులో ఒకే సమయంలో ఎదురెదురుగా వెళ్తున్న బస్సు సర్వీసులు

కంకిపాడు: బస్సు సర్వీసులు సమయపాలన పాటించకపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సు సర్వీసులు ఏ సమయానికి వస్తాయో కూడా అర్థంకాని పరిస్థితి నెలకొనటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గమ్యస్థానాలకు చేరుకోవటానికి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. మండలంలోని తెన్నేరు గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు నడుపుతోంది. గన్నవరం ఆర్టీసీ డిపో నుంచి కేసరపల్లి మీదుగా ఉప్పలూరు, మంతెన, తెన్నేరు గ్రామాలకు బస్సు సర్వీసులను నడుపుతోంది. నిత్యం ఆయా గ్రామాల నుంచి ప్రయాణికులు గమ్యస్థానాలను చేరుతున్నారు. ప్రత్యేకించి విజయవాడ పరిసర ప్రాంతాల్లో ఉపాధి కోసం వెళ్లే కార్మికులు, ఉద్యోగులు, విద్యాభ్యాసానికి వెళ్లే విద్యార్థులు ఈ బస్సు సర్వీసులపైనే ఆధారపడి రాకపోకలు సాగిస్తున్నారు.

సమయపాలనలో నిర్లక్ష్యం...

అయితే బస్సు సర్వీసులు నడుస్తున్నా సమయపాలన విషయంలో జరుగుతున్న నిర్లక్ష్యం కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకే సమయంలో రెండేసి బస్సు సర్వీసులు రావటంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు అవస్థలు పడాల్సి వస్తుంది. ఆర్టీసీ అధికారులు సర్వీసుల నిర్వహణ విషయంలో సరైన శ్రద్ధ వహించటం లేదు. దీంతో సర్వీసులు ఇష్టానుసారంగా నడుపుతున్నారు. సమయానుకూలంగా బస్సు సర్వీసులు నడవకపోవటంతో ప్రైవేటు వాహనాలు, ఆటోలను ఆశ్రయించాల్సిన దుస్థితి ప్రయాణికులకు నెలకొంది. ప్రతి 40 నిమిషాలకు ఒక బస్సు సర్వీసు రావాల్సి ఉన్నా ఆ మేరకు సర్వీసులు నడవటం లేదు. దీంతో అటు గన్నవరం, కేసరపల్లి, ఇటు ఉప్పలూరు, మంతెన, తెన్నేరు గ్రామాల ప్రయాణికులు రవాణా సదుపాయాలు విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ అధికారులు సమస్యను గుర్తించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఒకే సమయంలో సర్వీసులు



ప్రతి 40 నిమిషాలకు ఒక సర్వీసు నడవాల్సి ఉంది. కానీ ఒకే సమయంలో రెండు సర్వీసులు రావటంతో సమయానుకూలంగా సర్వీసులు నడవటం లేదు. మిగిలిన సమయాల్లో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సకాలంలో సర్వీసులు నడిచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–కలపాల వజ్రాలు, తెన్నేరు

నేత్ర దానం చేసిన కమ్యూనిస్టు నాయకురాలు



సూర్యదేవర సుగుణమ్మ ; సుగుణమ్మకు నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

పెనమలూరు: ఉమ్మడి కృష్ణా జిల్లా సీపీఐ నాయకురాలు సూర్యదేవర సుగుణమ్మ (78) వృద్ధాప్యంతో గురువారం మరణించారు. ఆమె కానూరులో కుమారుడి వద్ద ఉంటున్నారు. సుగుణమ్మ భర్త సూర్యదేవర నాగేశ్వరరావు ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యదర్శిగా, రైతు సంఘ నేతగా పని చేశారు. సుగుణమ్మ కూడా భర్తతో కలిసి ప్రజాపోరాటాలు చేశారు. కాగా ఆమె మరణానంతరం నేత్రాలను దానం చేయగా తాడిగడప ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి వైద్యులు నేత్రాలు సేకరించారు. కాగా సుగుణమ్మ మరణంతో రాష్ట్ర, జిల్లా సీపీఐ నాయకులు జెల్లి విల్సన్, ముప్పాళ్ల నాగేశ్వరరావు, దోనేపూడి శంకర్, జి.కోటేశ్వరరావు పార్టీ జెండాను కప్పి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు సీపీఐ నేతలు మున్నంగి నరసింహారావు, నార్ల వెంకటేశ్వరరావు, మోతుకూరి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల షెడ్యూల్‌లో మార్పులు

కంకిపాడు: రెవెన్యూ సదస్సుల షెడ్యూల్‌లో మార్పులు చేసినట్లు తహసీల్దార్ వి.భావనారాయణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 6న మారేడుమాక, 9న మంతెన, 10న జగన్నాథపురం, 11న వేల్పూరు, 12న ఉప్పలూరు, 13న కుందేరు, 16న కందలంపాడు, 17న దావులూరు, 18న చలివేంద్రపాలెం, 19న ప్రొద్దుటూరు, 20న కొణతనపాడు, 21న నెప్పల్లి, 23న కోలవెన్ను, 24న పునాదిపాడు, 26న ఈడుపుగల్లు, 27న మద్దూరు, 28న గొడవర్రు, 30న కంకిపాడు, 31న తెన్నేరు గ్రామాల్లో గ్రామ సదస్సులు జరుగుతాయన్నారు. సభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామ సచివాలయం ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఎంఎస్‌ఎంఈ జియో కోఆర్డినేషన్ సర్వేలో అలసత్వం వహిస్తున్నారంటూ పలువురు గ్రామ సచివాలయ ఉద్యోగులకు ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎంఎస్‌ఎంఈ జియో కోఆర్డినేషన్ సర్వే, హౌస్‌హోల్డ్ సర్వేలో గ్రామ సచివాలయ ఉద్యోగులకు విధించిన నిర్ణీత టార్గెట్ పూర్తి చేయకపోవటంతో షోకాజ్ నోటీసులు ఇస్తున్నట్లుగా పేర్కొన్నారు. అంతేకాక 24 గంటలలోపు ఈ నోటీసులకు లిఖితపూర్వక సంజాయిషీ తెలపాలని ఆదేశించారు. మండల కేంద్రమైన బాపులపాడులో ఆరుగురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో బాపులపాడు-1 గ్రామ సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ మురళీకృష్ణ షోకాజ్ నోటీసులపై అసహనం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయటం చర్చనీయాంశమైంది. ఎంఎస్‌ఎంఈ సర్వేలో నిర్ణీత టార్గెట్ పూర్తి చేసినప్పటికీ ఉద్దేశపూర్వకంగా షోకాజ్ నోటీసులు ఇచ్చారని, పని ఒత్తిడితో తమను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు.

సేంద్రియ పద్ధతులతో అధిక దిగుబడులు

రామవరప్పాడు: సేంద్రియ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ డీఎంఎఫ్ విజయకుమారి అన్నారు. విజయవాడరూరల్ మండలం రాయనపాడు రైతు సేవా కేంద్రంలో గురువారం 'ప్రపంచ నేల దినోత్సవం' నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ భూమిలోని జీవరాశులను కాపాడుకుంటూ రసాయన ఎరువులు తగ్గించి పంట దిగుబడులు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఏడీఏ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పంటల బీమా పథకం అయిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనపై రైతులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. 2024-25 పంటలకు సంబంధించి పంటల బీమా కోసం రైతులు విధిగా వారి పొలం వివరాలతో ఎకరానికి రూ.126 ప్రీమియం చెల్లించి రూ.42 వేలు బీమా పొందేందుకు అర్హులు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సురేష్, వీఏఏ బెన్నీ, రైతులు పాల్గొన్నారు.

275 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న సీఐ

గన్నవరం: మండలంలోని సూరంపల్లి శివారులోని గోడౌన్‌లో అక్రమంగా నిల్వ చేసిన 275 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం పోలీసులు పట్టుకున్నారు. సూరంపల్లి గ్రామ పరిధిలోని మహిళా పారిశ్రామికవాడలోని ఓ గోడౌన్‌లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లుగా పోలీసులకు సమాచారం అందింది. సీఐ శివప్రసాద్ నేతృత్వంలో సిబ్బంది అక్కడికి చేరుకుని గోడౌన్‌లో 550 బస్తాల్లో రవాణా చేసేందుకు సిద్ధం చేసిన రేషన్ బియ్యాన్ని గుర్తించారు. రేషన్ బియ్యాన్ని సీజ్ చేసిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తి విజయవాడకు చెందిన రమేష్‌గా పోలీసులు గుర్తించారు.

సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష


సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

పెనమలూరు: సీఎం నారా చంద్రబాబునాయుడు ఈ నెల 7వ తేదీన పోరంకి పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ గురువారం సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు, పలువురు అధికారులు పోరంకి మురళీ రిసార్ట్‌లో ఏర్పాట్లు పై పలు శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ నెల 7వ తేదీన సీఎం ఎనర్జీ ఎఫిసియన్సీ సర్వీసస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఆధ్వర్యంలో ఊర్జావీర్ కార్యక్రమాన్ని సీఎం లాంఛనంగా ప్రారంభిస్తారు. ఈ సమావేశానికి హాజరయ్యే వారికి పార్కింగ్, ఇతర సౌకర్యాల గురించి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆర్డీవో హేలాషారోన్, జెన్కో సేఫ్టీ చీఫ్ అధికారి విజయలక్ష్మి, డైరెక్టర్ సంజయ్, ఎస్ఈ సత్యానందం, తాడిగడప మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఉంగుటూరు: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కృత్తివెన్ను మండలం కలవపూడికి చెందిన జి.ప్రశాంత్ (30) ఎస్‌సీసీ కంపెనీలో పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి వేసి సర్వీసు కనెక్షన్లు ఇస్తున్నారు. ఈ క్రమంలో వేమండ గ్రామంలో విద్యుత్ స్తంభాలు తొలగించి కొత్తవి వేసిన తరువాత ఓ ఇంటికి సర్వీసు కనెక్షన్ ఇచ్చే సమయంలో ఒక్కసారిగా కరెంట్ రావడంతో షాక్‌కు గురయ్యాడు. కిందపడటంతో తలకు తీవ్రగాయమైంది. క్షతగాత్రుడిని ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూదాన యజ్ఞం కరపత్రం విడుదల

పెనమలూరు: తాడిగడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో భూదాన యజ్ఞం కరపత్రం గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు వివరాలు తెలుపుతూ దేవాలయం అభివృద్ధిలో భాగంగా మరో భవన నిర్మాణం చేపడతామన్నారు. ఎస్బీబీఎల్ అధినేత బాలాజీ తక్కువ ధరకు స్థలం ఇవ్వటానికి అంగీకరించారని, స్థల కొనుగోలుకు దాతలు సహకరించాలని కోరారు. అలాగే నూతన భవన నిర్మాణానికి కూడా దాతలు సహకరించాలని కమిటీ సభ్యులు అభ్యర్థించారు. నిధులు విరాళంగా ఇచ్చిన వారి పేర్లు శిలఫలకంపై రాస్తామన్నారు. దేవాలయం అభివృద్ధికి అందరి సహకారం కావాలని కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కంకిపాడు: విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ టి.అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 6వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ గంగూరు విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు కారణంగా కంకిపాడు, ఈడుపుగల్లు, ఉప్పలూరు, మద్దూరు, ప్రొద్దుటూరు, మారేడుమాక, కోలవెన్ను సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేత

పెనమలూరు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఆపరేషన్స్ ఈఈ పి.హరిబాబు తెలిపారు. గంగూరు సబ్‌స్టేషన్ మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8.30 గంటలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా పెనమలూరు, పోరంకి, గంగూరు, గోసాల, చోడవరం గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. స్థానికులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు కావడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మచిలీపట్నంలో నివశిస్తున్న గొల్ల కోటేశ్వరరావు (58) బుధవారం విజయవాడలో వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. తిరిగి బైక్ పై మచిలీపట్నంకు బయలుదేరాడు. గంగూరు వద్దకు రాగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. గాయపడిన కోటేశ్వరరావును విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

పెనమలూరు: మండల పరిధిలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. భూ సమస్యలతో పాటు రెవెన్యూ పరంగా ఉన్న సమస్యల పై ఆయా గ్రామ ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పెనమలూరులో ఈ నెల 6వ తేదీ, కానూరులో 10న, తాడిగడపలో 12న, పోరంకిలో 17న, చోడవరంలో 19న, పెదపులిపాకలో 21న, గోసాలలో 24న, గంగూరులో 27న, పెనమలూరులో 31న, జనవరి 3న వణుకూరులో సదస్సులు నిర్వహిస్తామన్నారు.

పోరంకిలో వ్యక్తి అదృశ్యంపై కేసు

పెనమలూరు: పోరంకిలో రోజువారి ఫైనాన్స్ చేసే వ్యక్తి అదృశ్యం కావటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం... పోరంకి బ్రహ్మంగారి గుడి వద్ద మారుతిఎన్‌క్లేవ్‌లో సత్తి రవీంద్రరెడ్డి కుటుంబ సభ్యులతో మూడేళ్లుగా ఉంటున్నాడు. ఆయన రోజువారీ ఫైనాన్స్ వ్యాపారం చేస్తాడు. అయితే క్రికెట్ బెట్టింగ్‌తో పాటు షేర్‌మార్కెట్ అలవాట్లు ఉన్నాయి. ఇటీవల బెట్టింగ్‌లో సొమ్ము పోగొట్టుకున్నాడు. దీంతో ఈ నె 2వ తేదీన ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. ఈ ఘటనపై రవీంద్రరెడ్డి బావ సబెళ్ల రామకృష్ణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రవీంద్రరెడ్డికి బెట్టింగ్ అలవాటు ఉండటంతో గతంలో కూడా ఇంటి నుంచి వెళ్లి పోయి కొద్ది రోజులకు తిరిగి వచ్చాడని తెలిపారు. ప్రస్తుతం ఫోన్ పని చేయటం లేదని పేర్కొన్నాడు.

స్కానింగ్ కేంద్రాలు నమోదు తప్పనిసరి

జిల్లా వైద్యాధికారి గీతాబాయ్


కానూరులో స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి గీతాబాయ్

పెనమలూరు: స్కానింగ్ కేంద్రాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి జి.గీతాబాయ్ తెలిపారు. కానూరులో అద్వయ ఫీటల్ మెడిసిన్ స్కాన్ సెంటర్‌ను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గీతాబాయ్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా పీసీపీఎన్డీటీ చట్ట పరిధిలో నమోదు చేయాలని చెప్పారు. ఎవరైనా లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టాన్ని ఉల్లంఘించితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే ఐఎంఏ గుర్తింపు రద్దు చేస్తామన్నారు. జిల్లాలో తక్కువ లింగ నిష్పత్తి గల ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. స్కానింగ్ కేంద్రాలకు వచ్చే గర్భిణుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, గర్భంలో ఉన్న శిశువు ఆడ-మగ అని నిర్ధారణ చేయరాదన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని నర్సింగ్ హోమ్‌లు, వైద్యశాలలు, డెంటల్ క్లినిక్‌లు, లాబోరేటరీలు, ఫిజియోథెరపీ క్లినిక్‌లు చట్ట ప్రకారం నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. అలా నమోదు కాని కేంద్రాలపై చర్యలు ఉంటాయన్నారు.

క్రీడల్లో జెడ్పీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ


క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయుల బృందం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి తెలిపారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన విద్యార్థులను గురువారం పాఠశాల ఉపాధ్యాయుల బృందం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ 2023-24 సంవత్సరాల్లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్‌లో విద్యార్థులు 42 మంది పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. వీరిలో బాలికలు 4, బాలురు 5 రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. అలాగే 2024-25 సంవత్సరాలకు గానూ జాతీయ స్థాయి పోటీలకు ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు వివరించారు. కరాటేలో బి. సన్యాసిరావు, ఫుట్‌బాల్‌లో అక్షయ, నెట్‌బాల్‌లో చరణ్ బాలాజీ, సాతియా, సుప్రియలు దేశంలో పలు రాష్ట్రాల్లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు పూర్ణచంద్రరావు, రాజేంద్ర, బలరాం, గౌసియాలు అభినందనలు తెలియజేశారు.

చలో విజయవాడ విజయవంతం చేయాలి


చలో విజయవాడ పోస్టరు ఆవిష్కరిస్తున్న సీపీఎస్ ఈఏ ప్రతినిధులు

ఉయ్యూరు: సీపీఎస్ ఉద్యోగుల చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొక్కిలిగడ్డ నాంచారయ్య కోరారు. ఉయ్యూరు పట్టణంలోని నాగళ్ల రాశేశ్వరమ్మ, జానకిరామయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 10న సీపీఎస్ ఉద్యోగులు చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పోస్టరు ఆవిష్కరించారు. నాంచారయ్య మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగుల హక్కుల సాధనకై చేపట్టే చలో విజయవాడకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వీరయ్య నాయక్, సాంబిరెడ్డి , హసన్ అహ్మద్, పరసా సోమేశ్వరరరావు, కొలుసు ఆనంద విశ్వమోహన్, పరాత్పరి పాల్గొన్నారు.

జంపాన రాఘవయ్యకు నివాళి


జంపాన రాఘవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

కంకిపాడు: కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన నిస్వార్థ నేత జంపాన రాఘవయ్య అని పలువురు వక్తలు కొనియాడారు. కృష్ణా కల్లుగీత కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు, పోరాట యోధుడు జంపాన రాఘవయ్య సంస్మరణ కార్యక్రమం ఉప్పలూరు గ్రామంలో గురువారం నిర్వహించారు. రాఘవయ్య చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసినివాళులర్పించారు.

గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాఘవయ్య కృషి చేశారని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు కొనకళ్ల బుల్లయ్య, మురారి వాసు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, డైరెక్టర్ మటా యుగంధర్, శొంఠి శివరామప్రసాద్, స్థానిక నేతలు కొండవీటి శివయ్య, చలసాని రాధాకృష్ణ, పడవల మధుసూదన్‌రావు, జంపాన వీరస్వామి, పలువురు నేతలు పాల్గొన్నారు.

క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తాం

వీఆర్ సిద్ధార్థ (డీమ్డ్ టు బి) వీసీ వెంకటేశ్వర్లు


ఆలిండియా ఇన్విటేషన్ మహిళల వాలీబాల్ టోర్నీ ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయవాడస్పోర్ట్స్: వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ క్రీడలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని వర్సిటీ వైస్ చాన్సలర్ పి.వెంకటేశ్వర్లు తెలిపారు. కాలేజీ ఆవరణలో ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు జరిగే నాదెళ్ల బసవపూర్ణయ్య (ఎన్‌బీపీ) ఆలిండియా ఇన్విటేషన్ మహిళల వాలీబాల్ టోర్నీకి సంబంధించిన ట్రోఫీలను కాలేజీలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాలేజీ ఆవరణలో అంతర్జాతీయ ప్రమాణాలతో నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. అధునాతన స్టేడియంలో ప్రప్రథమంగా జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తుండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 12వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, గద్దె రామ్మోహన్ చేతుల మీదుగా ఆలిండియా వాలీబాల్ పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ పోటీలకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామని పేర్కొన్నారు. స్టేడియంలోని ఆరు కోర్టుల్లో 14 క్రీడాంశాల పోటీలను నిర్వహించుకోవచ్చని వెల్లడించారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో రాణించే క్రీడాకారులకు కాలేజీలో సముచిత స్థానం కల్పిస్తామని వెల్లడించారు. ఎన్‌బీపీ ట్రస్ట్ చైర్మన్ నాదేళ్ల బ్రహ్మాజీ మాట్లాడుతూ సెంట్రల్ రైల్వేస్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుజరాత్ స్పోర్ట్స్ హాస్టల్, ఐసీఎఫ్(చెన్నైయ్), సౌత్ సెంట్రల్ రైల్వేస్, సదరన్ రైల్వేస్ జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని వివరించారు. దేశ వ్యాప్తంగా టాప్ ప్లేస్‌లో ఉన్న 80 శాతం వాలీబాల్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఆర్‌వీఆర్ ఓటీటీ (హైదరాబాద్), సింహాద్రి టీఎంటీ స్టీల్, జీఆర్‌జీ ట్రస్ట్(కోయంబత్తూర్), ఆంధ్రా ఆసుపత్రి, హెల్ప్ ఆసుపత్రి ఈ పోటీలకు స్పాన్సర్‌లుగా వ్యవహిస్తున్నారని చెప్పారు. విజేతలకు రూ.2.75 లక్షల నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రో వైస్ చాన్సలర్ ఎ.వి.రత్నప్రసాద్, డైరెక్టర్ పాండురంగారావు, కృష్ణా జిల్లా వాలీబాల్ సంఘం కార్యదర్శి దోనేపూడి దయాకరరావు, ఎన్‌బీపీ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ దేవేంద్రరాజా పాల్గొన్నారు.